బెట్టింగులతో యువత చిత్తు

- చదువులకు ఎగనామం పెడుతున్న విద్యార్థులు
- బెట్టింగుల కోసం అక్రమాలకూ వెనుకాడని వైనం
- అప్పుల పాలవుతున్న సామాన్య, మధ్య తరగతి వర్గాల ప్రజలు



తిరువూరు: తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలనే ఆరాటంతో తప్పుడు మార్గాలను ఎంచుకుంటున్న యువత తమ జీవితాన్ని అంధకారమయం చేసుకుంటున్నారు. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లలో గెలుపు, ఓటములపై బెట్టింగ్‌లు ప్రధానంగా పేద, మధ్య తరగతి కుటుంబాల ఆర్థిక పరిస్థితిని తలకిందులు చేస్తున్నాయి.

పెన్షన్ సొమ్ముతో ఉడాయింపు..

ఇటీవల ఒక సచివాలయ ఉద్యోగి బెట్టింగుల్లో తీవ్రంగా నష్టపోయి పేదలకు పంచాల్సిన పెన్షను సొమ్ముతో ఉడాయించిన ఘటన అధికార వర్గాల్లో సంచలనం కలిగించింది. గతంలో కూడా ఈ ఉద్యోగి ఒకసారి ఇదే తరహాలో పెన్షను సొమ్ము బట్వాడా చేయకుండా ఇతర అవసరాలకు మళ్లించి అధికారులకు చిక్కి సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఆ ఉద్యోగి కుటుంబ సభ్యులు నానా తిప్పలు పడి ఉన్న కొద్దిపాటి భూమిని విక్రయించి ప్రభుత్వానికి సొమ్ము తిరిగి చెల్లించారు. ఉన్నతాధికారులు సచివాలయ ఉద్యోగి సస్పెన్షన్ ముగిసిన అనంతరం తిరిగి విధుల్లోకి తీసుకున్నప్పటికీ ఆ ఉద్యోగి వ్యవహార శైలిలో మార్పు రాలేదు. రెండో సారి తన బెట్టింగ్ వ్యసనానికి ప్రభుత్వ సొమ్ము వాడుకోవడంతో మళ్లీ సస్పెన్షన్‌కు గురయ్యాడు.

అప్పుల పాలవుతున్న ఉద్యోగులు

ఇటీవల తిరువూరు సర్కిల్‌లోని ఒక ఉపాధ్యాయుడు బెట్టింగులో తక్కువ సమయంలో అధిక మొత్తం సంపాదించవచ్చనే అత్యాశతో లక్షల్లో పందేలు కాశాడు. తోటి ఉపాధ్యాయులు, బంధువులు, పరిచయస్తుల నుంచి పెద్ద ఎత్తున చేబదుళ్లు తీసుకుని అవి తీర్చే మార్గం లేక పాఠశాలకు సంబంధించిన నిధులను దుబారా చేసి సస్పెన్షన్‌కు గురయ్యారు. పిల్లల చదువులు, కుటుంబ ఖర్చులకు సైతం డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న ఆ ఉపాధ్యాయుడి పరిస్థితి దయనీయంగా మారింది.

జూదరులకు అడ్డాగా ఈ ప్రాంతాలు..

తిరువూరు పట్టణంలోని చీరాల సెంటర్, జైబావి సెంటర్, మునుకుళ్ల రోడ్డు, మధిర రోడ్డు, బైపాస్ రోడ్డు తదితర ప్రాంతాలు జూదరులకు అడ్డాగా మారాయి. మూడు రోజుల కిందట మునుకుళ్ల రోడ్డులో బెట్టింగు వివాదంలో ఇద్దరు యువకులు ఘర్షణ పడి హత్యాయత్నానికి సైతం ఒడిగట్టిన వైనం పట్టణంలో సంచలనం రేపింది. గంజాయి, మద్యం సేవించిన మత్తులో అర్ధరాత్రి వేళల్లో రోడ్లపైనే ఘర్షణలకు పాల్పడుతున్న యువతతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహించినా, పాల్గొన్నా చట్టరీత్యా నేరం. ఇటువంటి జూదాలకు పోయి డబ్బులు నష్టపోవద్దు. ఎక్కడైనా బెట్టింగులు జరుగుతున్నట్లు సమాచారం ఇస్తే కేసులు నమోదు చేస్తాం. ఆన్‌లైన్ జూదాలు, బెట్టింగుల నిరోధానికి కృషి చేస్తున్నాం.

– కేవీజీవీ సత్యనారాయణ, తిరువూరు ఎస్‌ఐ

బెట్టింగ్ యాప్‌లను నిషేధించాలి



క్రికెట్ బెట్టింగులు, బెట్టింగ్ యాప్‌లతో యువకులు తీవ్రంగా నష్టపోతున్నారు. వీటి ఆకర్షణలో పడి డబ్బులు నష్టపోతున్నందున ప్రభుత్వం ఈ జూదాలను పూర్తిగా నిషేధించాలి. జూదాలకు పాల్పడేవారిపై కూడా కఠి నచర్యలు తీసుకోవాలి.

– ఎం శివయ్య, ముష్టికుంట్ల

నిఘా ఉంచాలి



పేద యువకులు ఎక్కువగా ఆకర్షితులవుతున్న క్రికెట్ బెట్టింగ్‌లపై పోలీసు నిఘా ఉంచాలి. ఉద్యోగులు, కూలీలు, విద్యార్థులు జూదాల బారిన పడి ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నందున అధికారులు నిర్వాహకులపై ఉక్కుపాదం మోపాలి.

– యరదేశి రామారావు, తిరువూరు

పెంచిన ఆస్తి పన్నును తగ్గించాలి: సీపీఐ



నూజివీడులో మాట్లాడుతున్న చలసాని రామారావు

నూజివీడు: పట్టణాల్లో పెంచిన ఆస్తి పన్నును ప్రభుత్వం వెంటనే తగ్గించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు డిమాండ్ చేశారు. పట్టణంలోని అమర్ భవన్ లో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. 2025–26 సంవత్సరానికి సంబంధించి పట్టణాల్లో ఆస్తి పన్ను గత ఏడాదితో పోలిస్తే 15 శాతం పెరిగిందని, నాలుగేళ్ల క్రితంతో పోల్చితే 30 శాతం పెరిగిందని చెప్పారు. దీనివల్ల రూ.320 కోట్ల భారం పట్టణ పేదలపై పడుతుందన్నారు. ఎన్నికల్లో కూటమి పార్టీలు ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని సమీక్షిస్తామని, అసలు పన్నులు పెంచబోమని హామీ ఇచ్చి ఇప్పుడు ఆస్తి పన్నును పెంచేసి కూటమి ప్రభుత్వం మాట తప్పిందని విమర్శించారు. పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, నాయకులు పల్లె ప్రేమ్‌కుమార్, పి ప్రవీణ్, ఒగ్గు ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిబద్ధతతో పనిచేయండి

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అవినాష్



ఇబ్రహీంపట్నం: పార్టీ పదవులు పొందిన ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీ బలోపేతానికి నిబద్ధతతో పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ సూచించారు. జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన పచ్చిగోళ్ల వెంకటరత్న రాజు (పండు) దేవినేని అవినాష్‌ను జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పండుని అవినాష్ శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ప్రజల పక్షాన పోరాడాలని చెప్పారు. కూటమి నాయకుల కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టాలన్నారు. కూటమి నాయకులతో ఇబ్బందులు పడుతున్న కార్యకర్తలకు అండగా నిలవాలని సూచించారు.

గ్రంథాలయానికి వితరణ

తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలను శాఖా గ్రంథాలయానికి మరుగుదొడ్లలో నీటి సదుపాయం నిమిత్తం గ్రామానికి చెందిన రిటైర్డు ఉద్యోగులు రాయల వెంకటేశ్వర్లు, రామాల నాగేశ్వరరావు గురువారం మోటారు, పైపులను వితరణగా ఇచ్చారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు అసౌకర్యంగా ఉన్నందున మరుగుదొడ్ల నిర్వహణకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు దాతలు ముందుకు వచ్చారని గ్రంథాలయాధికారి శ్రీలత చెప్పారు. దాతలను అభినందించారు.

ఆర్థిక సాయం అందజేత



తిరువూరు: ఆత్మహత్యకు పాల్పడిన కానిస్టేబుల్ కుటుంబానికి తిరువూరు సర్కిల్ పోలీసులు గురువారం అంత్యక్రియల నిమిత్తం రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. వత్సవాయి పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ చిల్లపల్లి శ్రీనివాసరావు గంపలగూడెంలోని తన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తిరువూరు సీఐ గిరిబాబు, ఎస్‌ఐ సత్యనారాయణ, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. సోమయ్యలు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు శ్రీనివాసరావు అంత్యక్రియలు, ఇతర అవసరాల నిమిత్తం ఆర్థిక సాయాన్ని అందించారు.

మొరార్జీ దేశాయ్‌కి నివాళి



తిరువూరు: దివంగత మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ వర్ధంతి కార్యక్రమం గంపలగూడెం మండలం పెనుగొలనులో షిర్డీ సాయి సేవా కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కమిటీ యూత్ కన్వీనర్ వూటుకూరు యజ్ఞకృష్ణ, సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత దేశాభివృద్ధిలో మొరార్జీ కృషిని వారు కొనియాడారు.

సారా విక్రయదారుల బైండోవర్

చాట్రాయి: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సారా విక్రయాలు నిర్వహించిన పాత నేరస్తులు 27 మందిని గురువారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని నూజివీడు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 27 మందిని బైండోవర్ చేయగా, వారిని నేరాలకు పాల్పడ వద్దని, మళ్లీ నేరాలు చేస్తే ప్రభుత్వం నుంచి అందే పథకాలు రద్దవుతాయని, లక్ష రూపాయలు జరిమానా విధిస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.

పెట్రో ధరలు తగ్గించాలని ధర్నా



తిరువూరులో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

తిరువూరు: కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో తిరువూరులో గురువారం ధర్నా నిర్వహించారు. ఎస్‌ఆర్ టవర్స్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేకల నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరిస్తూ ఎన్‌డీఏ ప్రభుత్వం ధరలను విపరీతంగా పెంచుతోందన్నారు. గ్యాస్ సిలిండర్‌పై ఒకేసారి రూ.50 పెంచడం పేదలకు పెనుభారమవుతుందని చెప్పారు. నాయకులు నాగేశ్వరరెడ్డి, చినబాబు, వెంకటేశ్వరరావు, తులసి, రవి, ఎస్‌వీ భద్రం తదితరులు పాల్గొన్నారు.

- **విస్సన్నపేట:** పెంచిన గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో విస్సన్నపేటలో గురువారం ధర్నా నిర్వహించారు. సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరనాథ్, నాయకులు పాల్గొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో విస్సన్నపేటలో గురువారం పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరల పెంపునకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి వి. నాగరాజు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగుల ఆందోళన



ఆందోళన చేస్తున్న నాయకులు, ఉద్యోగులు

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో ఉద్యోగులు గురువారం ధర్నా నిర్వహించారు. అసోసియేషన్ చైర్మన్ కె.నరసింహారావు, సీసీఎస్ ఎంసీ బోర్డ్ సభ్యుడు అనంత రాములు, రీజనల్ నాయకులు వీఎస్ రెడ్డి, రత్నకుమారి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ డిపోలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో యాజమాన్యం పూర్తిగా విఫలమైందన్నారు. వెహికల్స్ కండిషన్ కుంటుపడిందని, సరి చేయాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని చెప్పారు. 2019 సర్క్యులర్ అమలు చేయవలసిందిగా జీఓ ఇచ్చినప్పటికీ కింది స్థాయి అధికారులు దానిని అమలు చేయకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సైన్స్ ఎక్స్‌పో ఫలితాలు విడుదల

తిరువూరు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా స్థాయిలో ఇటీవల నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో ఫలితాలను జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. గంగాధర్ గురువారం తిరువూరులో వెల్లడించారు. మూఢనమ్మకాలు–శాస్త్రీయ దృక్పథం విభాగంలో జగ్గయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నాగి శ్యామశ్రీ జట్టు ప్రథమస్థానం సాధించిందని తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో ప్రథమ స్థానాన్ని విజయవాడ వీపీఎస్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు కాకర్ల అశ్విన్ సాయి టీం, ద్వితీయ స్థానాన్ని ఎ.కొండూరు మండలం కంభంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు వి. ప్రవల్లిక జట్టు గెలుపొందాయని చెప్పారు. పర్యావరణం –సుస్థిరాభివృద్ధి విభాగంలో కంభంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎస్. షకీనా, సీహెచ్ ఉదయకీర్తి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను జన విజ్ఞాన వేదిక ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురళీమోహన్, గంగాధర్ అభినందించారు.

పోషకాహారంపై అవగాహన

ముసునూరు: పోషణ పక్షోత్సవాల సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చెక్కపల్లి సెంటర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం అంశాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.
అంగన్‌వాడీ కార్యకర్తలు కనకదుర్గ, ఆనమ్మ, అలివేలు, విజయలక్ష్మి, ఏసు రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఆగిరిపల్లి: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ పీడీ శారద పేర్కొన్నారు. పౌష్టికాహార మాసోత్సవాలను గురువారం స్థానిక కొండ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ ధనలక్ష్మి, సూపర్‌వైజర్ రాగమయి తదితరులు పాల్గొన్నారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

నూజివీడు: యనమదల శివారు రేగుంటలో ఎక్సైజ్ సిబ్బంది గురువారం నిర్వహించిన దాడుల్లో 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయడంతో పాటు 22 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని ఏఈఎస్ జి.పాండురంగారావు తెలిపారు. 20 లీటర్ల సారాను కలిగి ఉన్న రేగుంటకు చెందిన కోమరవు రవిని అదుపులోకి తీసుకోవడంతో పాటు బైక్‌ను, 3 కిలోల పటికను, 20 కిలోల అమ్మోనియాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇతనికి బెల్లంను సరఫరా చేస్తున్న పట్టణానికి చెందిన మాటూరి వాయుకుమార్ ట్రేడర్స్ యజమాని మాటూరి దత్త ప్రకాష్‌పై కేసు నమోదు చేశామని చెప్పారు. ఎమ్మార్ అప్పారావు కాలనీకి చెందిన కొంపెల్లి పుల్లయ్య వద్ద రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని అతనిని అరెస్టు చేశామన్నారు.

నేడు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. ఈ వేడుకల్లో 2019–20, 2020–21, 2021–22 విద్యా సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు పట్టభద్రుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని చెప్పారు.

వృద్ధి వైపు ఆర్థిక వ్యవస్థ పయనం

మైలవరం: అభివృద్ధి వైపు భారత ఆర్థిక వ్యవస్థ పయనిస్తోందని విజయవాడ పీబీ సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ అర్థశాస్త్ర శాఖాధిపతి డాక్టర్ సీహెచ్ సూర్యప్రకాశరావు అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కరీముల్లా అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీపురంశెట్టి రంగారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థ, ప్రపంచీకరణ, సరళీకరణ అంశాలను వివరించారు. భారత ఆర్థిక వ్యవస్థ ఇటీవలి కాలంలో వేగంగా వృద్ధి చెందుతోందన్నారు. ఇదే వృద్ధిని కొనసాగిస్తే త్వరలోనే అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో భారతదేశం చేరుతుందని వివరించారు.

విద్యుదాఘాతంతో మొక్కజొన్న పంట దగ్ధం

చాట్రాయి: ఆరుగాలం శ్రమించి పండించిన పదెకరాల్లోని మొక్కజొన్న పంట విద్యుదాఘాతంతో అగ్నికి ఆహుతైందని రైతులు వాపోతున్నారు. మండలంలోని ఆరుగొలనుపేటకు చెందిన రైతులు బొల్లికొండ వెంకటేశ్వరరావు, మల్లికార్జునరావు, పొట్లపల్లి సూరికి చెందిన పదెకరాల్లోని మొక్కజొన్న పంట గురువారం సాయంత్రం పూర్తిగా దగ్ధమైంది. దీంతో రూ.10 లక్షలకు పైగా నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

బెల్టు దుకాణాలపై ఎక్సైజ్ అధికారుల దాడి

26 మద్యం సీసాలు స్వాధీనం

తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ సర్కిల్‌లో బెల్టు మద్యం దుకాణాలపై ఎక్సైజ్ అధికారులు గురువారం దాడి నిర్వహించారు. గంపలగూడెం మండలంలోని పెదకొమెరలో మామిడి కన్నయ్య వద్ద ఎనిమిది సీసాలు, బొర్లెపోగు రవీంద్ర వద్ద ఆరు సీసాలు, తునికిపాడులో వేల్పుల సత్యం వద్ద ఆరు, గాదెవారిగూడెంలో నంద్యాల రామకృష్ణ వద్ద ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేశామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లిలో సారా తయారీ కేసులో నిందితులైన అజ్మీరా మంగి బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించినందుకు తహసీల్దారు రూ.లక్ష జరిమానా విధించారన్నారు.

దాళ్వా ధాన్యం కొనుగోలు చేయాలని వినతి

ఇబ్రహీంపట్నం: రబీలో రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మల్నీడి యలమందరావు ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లుకు గురువారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వరి కోతలు ప్రారంభమై 15 రోజులు కావస్తోందన్నారు. ధాన్యం ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకెళితే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధికారుల వ్యవహార శైలితో మిల్లర్లు దళారులుగా మారి రైతుల నుంచి క్వింటా రూ.1,300లకు అడుగుతున్నారని చెప్పారు. రైతు సంఘం నాయకులు బుడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హైవేపై నిలిచిన కలప లారీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి శాంతినగర్ వద్ద 30వ నంబర్ జాతీయ రహదారి బ్రిడ్జిపైకి వెళుతున్న లారీ ముందు టైరు యాక్సిల్ విరిగి పోవడంతో ఒక్కసారిగా పక్కకు ఒరిగిపోయింది. గురువారం జరిగిన ఈ ఘటనతో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. సేకరించిన వివరాల ప్రకారం.. ఈదర గ్రామం నుంచి వేప కలప లోడుతో హైదరాబాద్ వెళుతున్న లారీ కొండపల్లి వద్దకు రాగానే ముందు టైర్ యాక్సిల్ విరిగిపోయింది. దీనితో లారీ ఓవైపునకు ఒరిగిపోయింది. డ్రైవర్ అప్రమత్తతతో పెద్ద ప్రమాదం తప్పింది. రోడ్డు మధ్యలో లారీ ఆగిపోవడంతో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి లారీకి మరమ్మతులు చేయించారు.

లబ్ధిదారులకు సత్కారం

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేతనకొండ గ్రామంలో గావ్ చలో అభియాన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆ పార్టీ జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి మధుకర్, జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. పీఎం ఆవాజ్ యోజన, పీఎం కిసాన్ యోజన ద్వారా లబ్ధిపొందిన మహిళలను వారి గృహాలకు వెళ్లి సత్కరించి మొక్కలు నాటారు. నాయకులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు,
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com

సప్తగిరి గ్రామీణ బ్యాంక్
గొల్లపూడి బ్రాంచి, యన్‌టిఆర్ జిల్లా.

ముందస్తు అమ్మకపు ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్) 2002 లోని రూల్ 6(2), 8(6) క్రింద అమ్మకానికి ఉద్దేశిస్తూ ప్రకటన

1. శ్రీమతి బొమ్మిశెట్టి నీరజ, భర్త: వెంకటసత్య నాగకిషోర్‌బాబు, 54–14/2–5బి, ఫ్లాట్ నెం.202, శ్రీమయ నివాస్, భారతినగర్, విజయవాడ అర్బన్ (రుణగ్రహీత).
2. శ్రీ బొమ్మిశెట్టి వెంకటసత్య నాగకిషోర్ బాబు, తండ్రి: జాలయ్య, 54–14/2–5బి, ఫ్లాట్ నెం.202, శ్రీమయ నివాస్, భారతినగర్, విజయవాడ అర్బన్ (హామీదారు)

రిఫరెన్స్: స్వగృహ లోన్ అకౌంట్ నెం. 50032296703 శ్రీమతి బొమ్మిశెట్టి నీరజ, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, గొల్లపూడి బ్రాంచి.

[illegible] డి.06-09-2024 [illegible] రూ.18,54,735.20 [illegible] డి.28-01-2025 [illegible]

డి:03-04-2025 నాటికి బకాయి సొమ్ము రూ.19,86,960/- [illegible]

ప్రతిపాదిత అమ్మకం డి.22-05-2025, గురువారం మధ్యాహ్నం గం॥ 3.30 లకు అమ్మకము / బిడ్ ద్వారా నిర్వహించబడుతుంది.

[illegible] డి:07-04-2025 నుండి డి:21-05-2025 [illegible]

Nodal Bank A/c No. 96677559 | IFSC Code: SAGB0050154

[illegible]

ప్రదేశం: గొల్లపూడి, తేదీ: 04-04-2025 | అధీకృత అధికారి, సప్తగిరి గ్రామీణ బ్యాంక్

సప్తగిరి గ్రామీణ బ్యాంక్
గొల్లపూడి బ్రాంచి, యన్‌టిఆర్ జిల్లా.

ముందస్తు అమ్మకపు ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్) 2002 లోని రూల్ 6(2), 8(6) క్రింద అమ్మకానికి ఉద్దేశిస్తూ ప్రకటన

[illegible] నెం. 50014637707 [illegible]

[illegible] డి.22-09-2024 [illegible] రూ.14,03,836/- [illegible]

డి:03-04-2025 నాటికి బకాయి సొమ్ము రూ.14,97,153/- [illegible]

ప్రతిపాదిత అమ్మకం డి.22-05-2025, గురువారం మధ్యాహ్నం గం॥ 3.30 లకు అమ్మకము / బిడ్ ద్వారా నిర్వహించబడుతుంది.

Nodal Bank A/c No. 96677559 | IFSC Code: SAGB0050154

[illegible]

ప్రదేశం: గొల్లపూడి, తేదీ: 04-04-2025 | అధీకృత అధికారి, సప్తగిరి గ్రామీణ బ్యాంక్